ప్రజాశక్తి
మంగళవారం 23 సెప్టెంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

శ్రమదానంతో పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-చింతపల్లి : రాజుపాకల జాతీయ రహదారి నుండి సిరిపురం గ్రామం వరకు రహదారి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను స్థానికులు శ్రమదానం చేయడంతో తొలగించారు. రహదారి పక్కన పెరిగిన పొదల కారణంగా వాహనదారులకు మార్గం సరిగా కనిపించక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని సర్పంచ్ గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై గ్రామ ప్రజల సహకారంతో మరిన్ని ప్రాంతాల్లో కూడా ఇలాంటి శ్రమదానం కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలను నివారించే దిశగా చర్యలు కొనసాగిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగిస్తున్న స్థానికులు

సహజ వనరులను కొల్లగొట్టేందుకు కుట్ర

- హైడ్రో పవర్ ప్రాజెక్టులతో అడవులు నాశనం
- గిరిజనుల భూముల జోలికొస్తే తరిమి కొడతాం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

బూసికొండలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి -సీలేరు: హైడ్రోపవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దుప్పిలివాడ పంచాయతీ పరిధి బూసికొండ గ్రామంలో సోమవారం హైడ్రోపవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఆదివాసీ అరణ్యగర్జన సభను ప్రారంభించారు. సీలేరు పంపు స్టోరేజీ ప్రాజెక్టు నిర్వాసితుల కమిటీ అధ్యక్షుడు ప్రభాస్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు లోకనాథం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలేరు నుంచి అనంతగిరి వరకూ ఉన్న సహజ వనరులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లగొట్టడానికి కుట్రపూరితమైన చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనరస మాట్లాడుతూ, ఈనెల 22 నుంచి 27 వరకూ 400 కిలోమీటర్ల వరకూ వందలాది గ్రామాల్లో జనసమీకరణ హైడ్రో ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని, గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని గిరిజన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ ఇవ్వాలనే డిమాండ్లతో ఆదివాసీ అరణ్యగర్జనసభ బూసికొండ గ్రామం నుంచి ప్రారంభించామన్నారు. అరణ్యగర్జన సభ ఈనెల 27న హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలస గ్రామంలో పదివేల మందితో నిర్వహించనున్నామన్నారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు.

అనంతరం దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్కురాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ ఆదివాసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. హైడ్రో ప్రాజెక్టులతో కలిగే నష్టాలను వివరించారు. మాజీ సర్పంచ్ త్రినాథ్, బిఎల్ఎం ఇన్‌చార్జి రాజన్న దుప్పిలివాడ మాజీ సర్పంచ్ గాలికొండ ఎంపిటిసి అపరంగి బుజ్జిబాబు మాట్లాడుతూ గిరిజనులకు నష్టం కలిగించే హైడ్రో ప్రాజెక్టుల అనుమతులు ప్రభుత్వం రద్దు చేసుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పని హెచ్చరించారు. అనంతరం జెండా ఊపి జీపుజాత కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీలేరు వరకూ నిర్వాసితులు వివిధ సంఘాల నాయకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్వతినగర్, బూసికొండ, శాండికోరి, నిర్వాసితులతో పాటు దుప్పిలివాడ ధారకొండ పంచాయతీలకు చెందిన గిరిజనులు దండకారణ్య విమోచన సమితి జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్ మోతుగూడెం సిఐటి నాయకులు చింత రాంబాబు, సీలేరు సిఐటియు గౌరవ అధ్యక్షులు ఎస్కే సుభాన్ పాల్గొన్నారు.

అనంతగిరి: హైడ్రో పవర్ ప్రాజెక్టులపై ఆదివాసులు ఐక్యంతో సాంప్రదాయ ఆయుధాలతో తరిమికొట్టే సమయం ఆసన్నమైందని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర స్పష్టం చేశారు. మండలంలోని సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన భారీ మహా ర్యాలీ తహసిల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ఆదివాసి భూముల జోలికొస్తే తరిమి కొడతామని, గిరిజన సంఘం నేతలపై అక్రమంగా బనాయించిన కేసులు తక్షణమే ఎత్తివేయాలని నినాదాలు చేస్తూ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆదివాసులు చుట్టుముట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ, ఆదివాసి ప్రజల మనుగడను దెబ్బతీసి, అడవి జోలికి రాకుండా ఆదివాసి ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇప్పటికే అనేక రూపంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తూ వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. 51 జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుతో బూర్జ- వెంగడ- వాలసి. మూడు పంచాయతీలు సుమారు 20 గ్రామాలకు పైగా వందలాది కుటుంబాలు, వేలాది ఎకరాల భూమి దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. ఆదివాసి హక్కులు, చట్టాలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం అమాయకులైన గిరిజన ప్రజలను జల సమాది చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. చైనాక్లే తరహా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు గిరిజన ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అడవి తల్లి జోలికి వస్తే తరిమి కొడతామన్నారు.

అనంతగిరిలో ర్యాలీ చేపడుతున్న సురేంద్ర, గంగరాజు, గిరిజనులు

స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, పచ్చని అటవీ ప్రాంతాలను కొల్లగొట్టేందుకు కూటమి ప్రభుత్వం అదాని, నవయుగ కంపెనీలతో కుమ్మక్కై భయభ్రాంతులను చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు.ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు గిరిజన పక్షాన ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.రాష్ట్ర జిసిసి చైర్మన్ శ్రవణ్ కుమార్, దొన్నుదొరలు భారీగా ముడుపులు అందుకున్నారని విమర్శించారు. గిరిజన మనోభావాలను దెబ్బతీసే ఈ హైడ్రో పవర్ ప్రాజెక్టలపై కూటమి ప్రభుత్వం పునరాలోచన చేసి విరమించుకోవాలని, లేకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు పొద్దు. బాలదేవ్, టోకూరు సిపిఎం సర్పంచ్ కిలో. మోసియా, అనంతగిరి సిపిఎం సర్పంచ్ సోమ్మెల .రూతు, సుంకరమెట్ట సిపిఎం సర్పంచ్.జి. చిన్నబాబు, బస్కి సర్పంచ్ పాడి .సురేష్, అరకు వైసిపి పార్టీ వైస్ ఎంపీపీ కిల్లో .రామన్న, పెద్దకోట ఎంపిటిసి సిరిగం శ్రావణి, వేగడం మాజీ సర్పంచ్ సివేరి. కొండలరావు, హైడ్రోపవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ సభ్యులు ఎం. సురేష్. కుమార్, ఎం. కృష్ణంరాజు, స్వామి, చంటి, బొంజు బాబు, ఎస్.నాగులు పాల్గొన్నారు

అనంతగిరిలో భారీగా తరలివచ్చిన గిరిజనులు

వ్యక్తి దారుణ హత్య

- తన బైక్ తీసాడని అనుమానంతో అడిగినందుకు పొడిచి చంపిన వైనం
- పరారీలో నిందితుడు
- పాతకక్షలే కారణమన్న పోలీసులు

నిందితుడు కులదీపు వినోద్ అలియాస్ (బబుల)

మృతుడు వంతల భగత్‌రామ్

ప్రజాశక్తి -సీలేరు: తన ద్విచక్రవాహనం తీసాడనే అనుమానంతో తన బైక్ తనకు ఇవ్వాలని అడిగినందుకు ఏకంగా హత్య చేసిన ఘటన సీలేరులో తీవ్ర కలకలం రేపింది. ఆదివారం అర్ధరాత్రి జరిగిన హత్యకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జికె వీధి మండలం సీలేరుకు చెందిన వంతల భగత్‌రాంకు చెందిన ద్విచక్ర వాహనం నాలుగు నెలల కిందట పోయింది. అయితే తన బైక్‌ను సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపునకు చెందిన కులదీపు వినోద్ అలియాస్ (బబుల) చోరీ చేశాడని అనుమానించాడు. ఈ విషయమై కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య ఘర్షణ జరుగుతోంది. తన బైక్ తనకు ఇవ్వాలంటూ బబులపై భగత్‌రామ్ ఒత్తిడి చేశాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి బబుల, మృతుడు భగత్‌రామ్‌కు ఫోన్ చేసి నీ బైక్ నీకు ఇచ్చేస్తాను నాతో రా అని నమ్మబలికి స్థానిక ఎపి జెన్కో రెగ్యులేటరీ డ్యాం వద్దకు భగత్‌రామ్‌ను తన బైక్‌పై ఎక్కించుకొని గుంటవాడ రిజర్వాయర్ చివరికి తీసుకువెళ్లాడు. సమీపంలో ఉన్న బీరుబాటిల్‌తో అకస్మాత్తుగా భగత్‌రామ్ ఛాతిపైన, పొట్టపై తీవ్రంగా పొడిచాడు. అంతకుముందే భగత్‌రామ్ బబులపై సందేహంతో వారి బంధువులకు ఫోన్ చేసి ఆన్‌లో ఉంచాడు. బంధువులకు భగత్‌రామ్ కేకలు వినిపించడంతో వెంటనే అప్రమత్తమై సంఘటనా ప్రదేశానికి చేరుకునేసరికి అప్పటికే విగతజీవిగా పడిఉన్నాడు. భగత్‌రామ్ బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనపై జికె వీధి సిఐ వరప్రసాద్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భగత్‌రామ్ హత్యకు ప్రాపర్టీ లావాదేవీలు, పాతకక్షలే కారణమని వెల్లడించారు. ఆదివారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో హత్య జరిగినట్టు ప్రాథమికంగా తెలుస్తోందని నిందితుడు పరారీలో ఉన్నాడని, రెండు టీమ్‌లుగా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎస్ఐ రవీంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గంగవరం: మండల కేంద్రంలో ఉన్న సచివాలయ నిర్మాణం ఇప్పటివరకూ పూర్తి చేయలేదని కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. సోమవారం సర్పంచ్ అధ్యక్షతన కూటమి నాయకులు గంగవరం సచివాలయాన్ని సందర్శించారు. మండలంలో అన్ని సచివాలయాలు పూర్తయినప్పటికీ మండల కేంద్రంలో ఉన్న సచివాలయం ఇప్పటివరకూ పూర్తి కాలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తి చేయాలని కోరారు. సర్పంచ్ అక్కమ్మ, మాజీ ఎంపిపి తీగల ప్రభ, మాజీ ఎంపిటిసి కోసు బుల్లియమ్మ పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి కోటశ్రీజయరాజు

ఒకచోటే పునరావాసం కల్పించాలి

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీ స్థానిక సర్పంచ్ పిట్ట రామారావు, ఎస్టి సెల్ రాష్ట్ర కార్యదర్శి కోటశ్రీ జయరాజు సోమవారం చింతూరు ఐటిడిఎ ఆర్‌అండ్‌ఆర్ అధికారి ఎస్‌టిసి బాలకృష్ణారెడ్డిని కలిసి ఆర్‌అండ్‌ఆర్ పలు సమస్యల మీద విన్నవించారు. సర్పంచ్ రామారావు మాట్లాడుతూ చింతరేగుపల్లి, చిన్నమట్టపల్లి పంచాయతీలోని గుండుగూడెం చింతరేగుపల్లి పిడిఎఫ్ 160 ఇందులో గుండుగూడెంలో 55 పిడిఎఫ్ చింతరేగుపల్లి పిడిఎఫ్ 105 మొత్తం కలిపి ఒకచోటే పునరావాసం కల్పిస్తే బాగుంటుందని భూమికి భూమి మొత్తం 149 ఎకరాలు భూమిఉంది కాబట్టి దగ్గర్లోనే ఇవ్వాలని ఎస్‌టిసికి వినతిపత్రం అందించారు. ఎస్‌టిసి మాట్లాడుతూ పై అధికారులు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు గ్రామస్తులు కట్టి రామారావు, మడివి బాలరాజు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న పిఒ, సబ్ కలెక్టర్

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రంపచోడవరం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించి సమస్యల దరఖాస్తులు వ్యక్తిగతమునకు సంబంధించిన సమస్యల దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య నిర్వహించారు. పిఒ స్మరణ్‌రాజ్ మాట్లాడుతూ ఈ వారం 98 అర్జీలు వచ్చాయని తెలిపారు.

ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు: రైతులు ఇ క్రాప్ నమోదు చేయించుకోవాలని కొయ్యూరు మండల వ్యవసాయాధికారి బి.రాజ్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని బూదరాళ్ల సచివాలయం పరిధిలో విఎఎ ప్రభాకరరావు, రైతులతో కలిసి వరిపొలాలను పరిశీలించారు. పలువురు రైతులకు ఇ క్రాప్ నమోదు చేశారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు.

CHANGE OF NAME

I, **S.NAGOOR KANI,** S/o. Syed Mohamad, D.No. 3-185, Market Street, Near Devi Temple, Rampachodavaram, Alluri Sitha Ramaraju District, A.P., Pin: 533288, I have changed my name from **NAGOOR GANI** (Old Name) to **S.NAGOOR KANI** (New Name). Hence forth Iam being called **S.NAGOOR KANI,** S/o. Syed Mohamad, for all purpose.

రోడ్డు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ అడప వలస గ్రామంలో సిసి రోడ్డు మంజూరు చేయాలని పెసా కమిటీ అధ్యక్ష, .కార్యదర్శులు టి.సూర్యనారాయణ, సిహెచ్ రామూర్తి స్థానిక ఎంపీడీపీకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడపవలస గ్రామంలో మెయిన్ రోడ్డు నుంచి అంగన్వాడీ వరకు సుమారు 300 మీటర్లు వరకు సిసి రోడ్డు లేక అంగన్వాడీకి వెళ్లే చిన్నారులు, గ్రామస్తులు వర్షా కాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతిరోజు నిత్యం నడిచే దారిలో ఇరువైపులా తుప్పలు ఉండటంతో పాములు, పురుగులు వంటి విష జీవులతో భయాందోళన చెందుతున్నారని చెప్పారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి అడపవలసలో రహదారి సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పి.డొంబు, టి ఈశ్వరమ్మ.పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న పెసా కమిటీ నేతలు

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కుమార్, గ్రామస్తులు

'రోడ్లు యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలి'

ప్రజాశక్తి- రంపచోడవరం : వై.రామవరం మండలం దాలిపాడు పంచాయతీ పరిధిలోని పులుసుమామిడి నుంచి మునగలపూడి వరకూ బూరుగుపాలెం నుండి చందుర్తి వరకూ రోడ్డు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సిపిఐ డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్ ఆధ్వర్యంలో ఐటిడిఎ పిఒకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం పరిధిలోని చాలా గ్రామా ల్లో నేటికీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని కోరారు. పనులు త్వరగా పూర్తిచేయని పక్షం లో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమం లో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు గోముదుర్గ, అడ్డతీగల మండల కార్యదర్శి తమదాల కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వెనుకబడిన కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-రంపచోడవరం: ఏజెన్సీలో బాగా వెనుకబడిన కుటుంబాలను ఆర్థికంగా అభివద్ధి చెందే విధంగా అందరం కృషి చేయాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పివిఎల్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం రంపచోడవరం సమీపంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్లో పి4 బంగారు కుటుంబాలు కార్యక్రమం ద్వారా మాస్టర్ ట్రైనర్ల శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ముఖ్య ప్రణాళికల అధికారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి 4 ద్వారా పేదరిక నిర్మూలన అరికట్టే విధంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రతి మండలం నుండి మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈనెల 24 25 తేదీల్లో మండల స్థాయి శిక్షణ తరగతులు పి4పై ఇస్తున్నట్టు తెలిపారు.డిఎస్ఒ శ్రీదేవి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

విజ్ఞాన విహార యాత్రకు రైల్వే సౌకర్యం

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్ర నిమిత్తం విశాఖపట్నం ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు ప్రత్యేక సౌకర్యాన్ని కల్పించారు. విద్యార్థులకు రైల్వే టికెట్ కన్సొలేషన్ ఫారాలను సోమవారం అందజేశారు. ఈ ఫారాల సాయంతో విద్యార్థులు దేశవ్యాప్తంగా విజ్ఞాన విహార యాత్రలో భాగస్వాములు కావచ్చని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి రైల్వే అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎస్వీఆర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎల్.వెంకటరామిరెడ్డి రూ.30 వేల విలువైన పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను కళాశాలకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనిగంటలు పెంచడం సరికాదు

సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి -సీలేరు: ప్రభుత్వం పెంచిన రోజుకి 10 గంటల పని దినాలను వ్యతిరేకిస్తూ జికె వీధి మండలం సీలేరులో యునైటెడ్ ఎల్సిడి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఎపి జెన్కో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా సిఐటియు అధ్యక్షులు మార్నింగ్ చెన్నె పడాలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పనిగంటలను పెంచడం సరికాదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు నేటికీ విడుదల చేయలేదని విచారం వ్యక్తం చేశారు. పనిగంటల నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనుక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చింతా రాంబాబు, ఎస్.కె.శోబాన్, బ్రాంచ్ అధ్యక్షులు బి.లక్ష్మణరావు, విష్ణుకుమార్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎపిజెన్‌కో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు

పని గంటల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులకు పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం అరకులోయ మండల కేంద్రంలోని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా పెట్టుబడిదారుల కోసమే పని చేస్తోందన్నారు. ఎనిమిది గంటల పని సమయాన్ని 10 గంటలకు పెంచడం అన్యాయం అని విమర్శించారు. మహిళా కార్మికుల పరిస్థితిని ప్రస్తావిస్తూ, రోజంతా పనిలో గడిపి రాత్రి ఇళ్లకు చేరే సమయంలో భద్రత సమస్యలు పెరుగు తాయన్నారు. కుటుంబాలను చూసుకునే పరిస్థితి కూడా ఉండదని ఆయన అన్నారు. కనీస వేతన చట్టం, అలవెన్సులు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగాల భద్రత, ఈఎస్ఐ, పిఎఫ్ వంటి అంశాలను పట్టించుకోని ప్రభుత్వం, పని గంటల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. కార్మికులను ఉద్దేశ పూర్వకంగా హింసించే విధానాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల సమ్మెలు, అల్లూరి జిల్లాలో ఉధృతమైన పోరాటాలు తప్పవని ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. అరకులోయలో పర్యాటక సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో వందలాది టూరిజం కార్మికులు సమ్మెలోకి వస్తే పరిస్థితి ప్రభుత్వానికే భారమవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, రాజు రంజిత్ తదితరులు పాల్గొనారు.

ఆందోళన చేపడుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి- కూనవరం: కూనవరంలోని బెస్తబజారు, దళితవాడల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు అన్నారు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది సోమవారం కూనవరం పంచాయతీలోని ప్రబలుతున్న విషజ్వరాలను అధ్యయనం చేసి బెస్తబజారు దళితవాడల్లో నిలిచిన మురుగునీరు జ్వరాలకు కారణమవుతోందన్నారని పారిశుధ్య చర్యలు చేపట్టాలని సచివాలయంలో వినతి అందించారు. త్వరితగతిన చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ప్రజాఉద్యమం తప్పదని హెచ్చరించారు.

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

రక్షిత నీటి పథకం పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొయ్యూరు: ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ బి.వి.నాగేశ్వరరావు సోమవారం కొయ్యూరులో పర్యటించారు. ముందుగా ఆయన డిఇఇ కరుణ, ఎఇఇ సాయికృష్ణతో కలసి శింగవరం ఐటిడిఎ కాలనీలో రూ.23 లక్షలు, రాజేంద్రపాలెంలో రూ.31.10లక్షలు, అడ్డాకులలో రూ.258.70 లక్షలతో చేపడుతున్న జలజీవన్‌మిషన్ పనులను, తాగునీటి కుళాయిలను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

బిసి కాలనీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్‌పురం: వడ్డెగూడెం పంచాయతీ పరిధి విఆర్‌పురం బిసికాలనీరోడ్డు పనులను సోమవారం సర్పంచ్ సోడి నరసమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ నిధుల నుండి రోడ్డుకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. వడ్డిగూడెం ఉపసర్పంచ్ కోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో లోతుగెడ్డ వంతెన

• భయాందోళన చెందుతున్న ప్రయాణికులు

శిథిలావస్థకు చేరుకున్న లోతుగెడ్డపై ఉన్న వంతెన

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండల కోరుకొండ, బెన్నవరం లోతుగెడ్డ మార్గంలోని లోతుగెడ్డ పాత వంతెన ప్రజలకు ప్రాణహానికరంగా మారింది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన కాలం చెల్లి శిథిలావస్థకు చేరుకుంది. అయినా ఇదే మార్గంలో ప్రతిరోజూ చింతపల్లి-పాడేరుకు వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. వర్షాకాలం కారణంగా వంతెన కింద ప్రవహించే వాగు ఉప్పొంగిపోవడంతో ప్రవాహం మరింత వేగంగా సాగుతోంది. వంతెన కింద భాగంలో కోతకు గురి కావడంతో ప్రమాదం సంభవించే అవకాశాలు లేకపోలేదు. ఈ పరిస్థితిలో వంతెన బలహీనంగా మారి పైన బరువైన వాహనాలు వెళ్లినా ఎప్పటికప్పుడు పగుళ్లు పెరుగుతున్నాయి. దీంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి, ఇతర జిల్లా అధికారులు చింతపల్లి, జికె వీధి, కొయ్యూరు మండలాలను సందర్శించాలంటే ఈ వంతెన మార్గంలోనే రాకపోకలు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే కొత్త వంతెన నిర్మించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. పలుమార్లు అధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించినా ఇప్పటివరకు స్పందన రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణాలను రక్షించడానికి ప్రభుత్వం అత్యవసరంగా జోక్యం చేసుకుని కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

పెదబయలులో భారీ వర్షం

ప్రజాశక్తి-పెదబయలు : మండల కేంద్రంలో సోమవారం భారీ వర్షం కురిసింది. వారపు సంత వర్షంతో తడిసి ముద్దయింది. వ్యాపారాలు ఇబ్బంది పడ్డారు. చిరువ్యాపారాలు కూరగాయలు విక్రయించేందుకు మెయిన్ రోడ్డుపై విక్రయించుకోవాల్సి వచ్చింది. వర్షం కారణంగా సంత సక్రమంగా జరగలేదు. దసరా పండగ సందర్భంగా వ్యాపారాలు బాగా జరుగుతాయని వ్యాపారులు భావించినా వర్షం దెబ్బకొట్టింది.

దసరాకు ఊరెళ్తున్నారా...ఇల్లు జాగ్రత్త!

ప్రజాశక్తి-మధురవాడ : దసరా సెలవులకు సొంతూళ్లకు, విహారయాత్రలకు వెళ్లే నగరవాసులు తమ ఇళ్ల భద్రతలో తగు జాగ్రత్తలు పాటించాలని పిఎం.పాలెం క్రైం సిఐ బిఎస్ఎస్ ప్రకాష్ సూచించారు. ఇటీవల కాలంలో పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు పెరిగాయని, కట్టుదిట్టమైన భద్రత ఉన్న నివాసాల్లోనూ దొంగతనాలు జరుగుతుండడంతో పోలీసుశాఖపరంగా పటిష్ట చర్యలు చేపడుతున్నప్పటికీ, ప్రజలు అప్రమత్తత అవసరమన్నారు. అనుమానితుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఇంటికి తాళం వేసి వెళ్లినప్పుడు విలువైన వస్తువులను ఇంట్లో కాకుండా భద్రత ఉన్నచోట ఉంచాలని, బ్యాంకు లాకర్లలో ఉంచడం శ్రేయస్కరమన్నారు. ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అపార్టుమెంట్లు, కాలనీ కూడళ్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలనన్నారు. అనుమానితుల సమాచారన్ని 0891 2721333, 9440904314, 8331041672 నెంబర్లకు అందించాలన్నారు. పోలీసులకు సమాచారమిస్తే గస్తీని పటిష్టం చేసి, అవసరమైన భద్రత కల్పిస్తామని సూచించారు. దీనిపై అపార్ట్‌మెంట్స్, కాలనీ వాసులతో అవగాహన సదస్సులతోపాటు ఆటోల్లో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నామని సిఐ ప్రకాష్ వెల్లడించారు.

46 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

• జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో వచ్చే ఏడాది వన మహోత్సవానికి 46 లక్షల మొక్కలను నాటడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అధికారులకు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది లక్ష్యం రెట్టింపు అయిందని పేర్కొన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఫారెస్ట్, విద్య, ఇంజనీరింగ్, డ్వామా, గ్రామ వార్డు సచివాలయం శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల డిమాండ్, అవసరం, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన మొక్కలను నివేదికలో పొందుపరచాలని సూచించారు. ఐటిడిఎ మండలాల వారీగా మొక్కలు నాటడం సంబంధించిన డేటాను సిద్ధం చేయాలన్నారు. గతంలో నాటిన మొక్కలతో రైతులకు ఉపయోగకరంగా ఉన్నవి, లేనివి పరిశీలించాలని ఐటిడిఎ పిఓలను కలెక్టర్ ఆదేశించారు. గత సంవత్సరం డేటాను మేరీ లైఫ్ అనే యాప్ లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆన్లైన్ డేటాను ఐటిడిఎ పిఓలు పర్యవేక్షించాలని సూచించారు. 2026 సంవత్సరానికిగాను కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి నివేదికలు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ పిఓలు శ్రీ పూజ, బి.స్మరణ్ రాజ్, శుభం నోక్వాల్, పాడేరు డిఎఫ్ఓ పీవీ సందీప్ రెడ్డి, విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీ, సమగ్ర శిక్షణ అధికారి స్వామి నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్బిఎస్ నంద, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె.బాలకర్ణ, జిల్లా గ్రామ వార్డు సచివాలయం నోడల్ ఆఫీసర్ పి.ఎస్. కుమార్, డ్వామా పిడి విద్యాసాగర్ పాల్గొన్నారు.

చిత్తడి నేలను పరిరక్షించాలి

పాడేరు: చిత్తడి నేలను పరిరక్షించే బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ శాఖలతో జిల్లా స్థాయి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వెట్ ల్యాండ్స్ రూల్స్ 2017 ప్రకారం చిత్తడి నేల గుర్తింపు, సరిహద్దులు, నోటిఫికేషన్ చెయ్యాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎపిఎస్ఎసి ద్వారా రంపచోడవరం డివిజన్లో 71 వెట్ ల్యాండ్ గుర్తించామన్నారు. వాటిలో తాగునీరు, ఎకోటూర్, వ్యవసాయం, హార్టికల్చర్, ఫిషింగ్, రిక్రియేషన్, ఇరిగేషన్ వంటివి ఉన్నాయి, జిల్లా సర్వే చేసి రెండు రోజుల్లో నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీనికి సంబంధించి సబ్ డివిజన్ సిబ్బందితో సమావేశం నిర్వహించాలని సూచించారు. సర్వే కేటాయించిన సిబ్బందికి వెట్ ల్యాండ్స్ పై అవగాహనకు శిక్షణ తరగతులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. వెట్ ల్యాండ్ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వర్చువల్ విధానంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్, డిఎఫ్ఓ రవీంద్ర ధామా, జిల్ రిసోర్స్ అధికారి దేవేంద్రుడు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్బిఎస్ నంద, జిల్లా హార్టికల్చర్ అధికారి కె.బాలకర్ణ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి విజయ్ రామ్ పాల్గొన్నారు.

పోలియో బాధిత చిన్నారులకు చేయూత

సాయం అందజేస్తున్న మధు

ప్రజాశక్తి-చింతపల్లి : సిరిపురం గ్రామానికి చెందిన కిలో నాగేశ్వరరావు, గౌరీ దంపతుల ముగ్గురు పిల్లలు పోలియోతో బాధపడుతుండగా, వారి కుటుంబానికి పెదపూడి మధు ఆధ్వర్యంలో గ్రామస్తులు నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందించారు. బాధిత చిన్నారుల కోసం మరింత మంది దాతలు ముందుకు రావాలని మధు పిలుపునిచ్చారు

దసరా వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని బంధ వీధి గ్రామంలో సోమవారం దసరా నవరాత్రుల వేడుకలను స్థానిక సర్పంచ్ మాతే చిలకమ్మా, వైసిపి సీనియర్ నాయకులు మాతే వెంకటరమణ చేతుల మీదగా ఘనంగా ప్రారంభించారు. బంధవీధి గ్రామానికి చెందిన భవానీ భక్తులు అమ్మవారి మాలధారణ చేసి కనకదుర్గమ్మ పీఠం వద్ద కొలువుదీరారు. వేదమంత్రాలతో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు.రానున్న నవరాత్రుల్లో రోజులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని కమిటీ పెద్దలు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాంబాబు, జిమాడుగుల సిఐ శ్రీనివాస్, ఎస్ఐ షణ్ముఖరావు, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు గ్రామస్తులు భవాని భక్తులు పాల్గొన్నారు.

చింతపల్లి : మండలంలోని బయలుకించంగి గ్రామం రోడ్డు వీధిలో దసరా దేవీ నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పెద్దలు సాగిన కృష్ణం పడాల్, అరడ వీరబాబు, ఎంపీటీసీ మీనా కుమారి, లకే వెంకటరమణ, కాకరి చందు, నాగంనాయుడు, విగ్రహదాతలు లకే మహేశ్వరరావు, సరోజిని దంపతులు, స్థానిక యువత అమ్మవారి విగ్రహాన్ని మండపంలో ప్రతిష్టించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా పసుపు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో లకే సతీష్, సాగిన వెంకటేష్, కొర్ర నాగేశ్వరరావు, పసుపులేటి మత్స్యలింగం పడాల్, పసుపులేటి రవి, శెట్టి నాగేష్, వంతల గోపీనాథ్ పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సినేషన్

పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి-3, అంతర్ల గ్రామంలో పశువులు, మేకలు, గొర్రెలు, కుక్కలు, నాటు కోళ్లకు సోమవారం వ్యాక్సిన్ టీకాలు వేశారు. పెంపుడు కుక్కలకు ఆరు నెలలకు ఒకసారి రేబిస్ నిరోధక టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని వెటర్నరీ సిబ్బంది సూచించారు.

వ్యవసాయ ప్రగతికి కృత్రిమ మేధ దోహదం

• గీతం ఎఫ్‌డిపిలో నిపుణుల వెల్లడి

గీతం ఎఫ్‌డిపిని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న ప్రో వీసీ, అతిథులు

ప్రజాశక్తి-మధురవాడ : నాణ్యతతో కూడిన పంటల వృద్ధి, మానవ రహిత డ్రోన్‌ల ఆధారంగా పంటలను పర్యవేక్షణకు, కాలానుగుణంగా సాగు విధానాల్లో మార్పునకు కృత్రిమ మేధ ఎంతగానో దోహదపడుతుందని జాతీయ స్థాయి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ (ఎఫ్‌డిపి) నిపుణులు స్పష్టం చేశారు. సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఐఐటి గౌహతి ఎలక్ట్రానిక్స్ అండ్ ఐసిటి అకాడమీ, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ట్రిపుల్‌ఇ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా వ్యవసాయ రంగంలో కృతిమమేధ అంశం ఎఫ్‌డిపిని గీతం ప్రో విసి వై.గౌతమ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ కలిగిన మనదేశంలో 80 శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ఈ రంగమే 46 శాతం మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. వాతావరణ మార్పులు, మితిమీరిన క్రిమ సంహారకాల వాడకం, కార్మికుల లభ్యత ప్రస్తుతం వ్యవసాయ రంగాన్ని వెంటాడుతున్న సవాళ్లని, కృత్రిమ మేధ సాయంతో పంటల ఆరోగ్యం, భూమి నాణ్యత, వాతావరణ పరిస్థితులను గుర్తించి రైతులకు సకాలంలో సూచనలు చేయవచ్చునన్నారు. వ్యవసాయ రంగం రైతులకు ఆర్థికప్రయోజనం కలిగించేలా మార్చడంలో కృత్రిమమేధ దోహదపడుతుందన్నారు

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌తో వ్యవసాయ సమాచారాన్ని విశ్లేషించి, డేటా ఎనలిటిక్స్‌తో రైతులకు కమైన మార్గదర్శకం చేయవచ్చునన్నారు. పంటలపై ఎరువులను, క్రిమిసంహారకాలను తగిన మోతాదులో పిచికారి చేయడానికి డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందన్నారు ఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్రకుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగంలో ఎపి ప్రభుత్వ ప్రత్యేకశ్రద్ధ చూపుతూ, గ్రామీణ మహిళలకు డ్రోన్ వినియోగంపై శిక్షణ ఇస్తున్నారన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ రానున్న రోజులలో దేశ వ్యవసాయ రంగాన్ని ఆధునీకీకరణ వైపు కృత్రిమమేధ నడిపిస్తుందన్నారు. ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్ (ఎఎన్ఎన్) ద్వారా పంటలకు వచ్చే చీడలను వేగంగా గురిస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అధ్యయనాలు జరుగుతున్నాయన్నారు.. కార్యక్రమంలో సిఎస్ఐఆర్ చండీగఢ్ ప్రిన్సిపాల్ సైంటిస్ డాక్టర్ రితేష్‌కుమార్, ఐఐటి గౌహతి నుంచి డాక్టర్ గుహై, ఎఫ్‌డిపి కన్వీర్లు ప్రొఫెసర్ బి.రాజేష్‌కుమార్, డాక్టర్‌వి.జ్యోతి, డాక్టర్ ఐ.శ్రీనివాసరావు, పలువురు ఇంజనీరింగ్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్లాకులపాడు పంచాయతీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని మారేడుబాక పంచాయతీ ఉర్లాకులపాడు గ్రామాన్ని కోసూరివారివీధి, శరభవరం గ్రామాలతో కలిపి కొత్త పంచాయతీ ఏర్పాటు చెయ్యాలని జెడ్‌పిటిసి బుజ్జి చిన్నలమ్మ తదితరులు కోరారు. ఈ మేరకు ఐటిడిఎ పిఒను సోమవారం కలసి వినతిపత్రం అందించారు. ఏలేశ్వరం పక్కనే కోసూరివారివీధి, శరభవరం గ్రామాలు ఉన్నాయని, ఈ మూడు గ్రామాలకు పంచాయతీ కేంద్రం మారేడుబాక అని అక్కడికి వెళ్లాలంటే శరభవరం గ్రామస్తులు 30 కిమీ, ఉర్లకులపాడు గ్రామస్తులు 26 కిమీ ప్రయాణించాల్సి వస్తోందన్నారు. రవాణా సౌకర్యం కూడా లేదన్నారు. ఉర్లాకులపాడు కేంద్రంగా కొత్త పంచాయతి ఏర్పాటు చేయాలని కోరారు.కొచ్చా కాసులమ్మ, కోసూరి మల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒగా రవికిషోర్

రవికిషోర్

ప్రజాశక్తి-మారేడుమిల్లి: మారేడుమిల్లి ఎంపిడిఒగా రవికిషోర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో వై.రామవరం మండలంలో పనిచేసినట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యాలయ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ నారాయణ, తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు

ప్రజాశక్తి - విఆర్‌పురం: తెలుగు రాష్ట్రాల్లో జరుపుకునే బతుకమ్మ సంబరాలు సోమవారం అబ్దుల్ కలాంస్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి రంగు రంగుల పూలను పేర్చి బతుకమ్మల చుట్టూ చప్పట్లు, కోలాటం కొడుతూ బతుకమ్మ పాటలను పాడారు. స్కూల్ కరస్పాండెంట్ యం.డి.సాదత్ బతుకమ్మ సంబరాల విశిష్టత గురించి చెబుతూ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

పశువులకు వ్యాక్సిన్లు వేయించాలి

ప్రజాశక్తి - కొయ్యూరు: రైతులు తమ పశువులకు వ్యాక్సిన్లు వేయించాలని రాజేంద్రపాలెం వెటర్నరీ డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. కొయ్యూరు మండలం ఎం.మాకవరం గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ చైతన్య సోమవారం లొద్దిపాకలులో పశువులకు వ్యాక్సినేషన్ నిర్వహించారు. సుమారు 95 పశువులకు గాలికుంటు, డెక్క జడుపు వ్యాధి నిరోధక టీకాలను వేశామని తెలిపారు. పశువులు అనారోగ్యానికి గురైతే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.

బాలల గృహాల తనిఖీ కమిటీ మెంబర్‌గా నరవ ప్రకాశరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బాలల గృహాల తనిఖీ కమిటీ మెంబర్‌గా నరవ ప్రకాశరావు నియమితులయ్యారు. జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం విశాఖ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన బాలగృహాల పనితీరుపై తనిఖీ కమిటీ ఏర్పాటుకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, కమిటీకి జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని, మూడేళ్ల కాల పరిమితి గల ఈ కమిటీ జిల్లాలో బాలగృహాలు చట్టప్రకారం నిబంధనలు పాటిస్తున్నారా లేదా తనిఖీచేసి, నివేదికలు ప్రభుత్వానికి అందజేస్తాయన్నారు. ఈ కమిటీ సమావేశం ఈ నెల 25న జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జరగనుందన్నారు. నరవ ప్రకాశరావు ఎవిఎన్ కాలేజీ పూర్వ వైస్ ప్రిన్సిపల్, బాలవికాస ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

డిమాండ్లు నెరవేర్చేవరకూ దశలవారీ ఉద్యమం

ప్రజాశక్తి -సీలేరు: తమ డిమాండ్లు నెరవేర్చే వరకూ దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని విద్యుత్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వై.సత్తిబాబు వై.ధార్రాజు హెచ్చరించారు. సోమవారం సీలేరులో ఎపి జెన్కో కార్యాలయాల నుంచి శాంతియుతంగా ర్యాలీ చేపట్టారు. 'ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి ఇపిఎఫ్ నుంచి జిపిఎఫ్‌గా మార్చి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి' అని నినాదాలు చేశారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల్ని తక్షణమే రెగ్యులర్ చేయాలని అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు కార్మికులు, కాంటాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ప్రజాక్షేత్రంలో పరిశీలన చేయాలి

- అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి -కూనవరం: కూనవరం పంచాయతీ నిధుల దుర్వినియోగంపై 24న జిల్లా అధికారులు విచారణకి వస్తున్న సందర్భంగా గ్రామసభ ఏర్పాటు చేసి సంబంధిత ఆధారాలను ప్రజాక్షేత్రంలో పెట్టాలని ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరావుకి అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెరపాటి రవీంద్ర, జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి కిషోర్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయే పనులు చేశారు వాటికి సంబంధించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని నామ మాత్రంగా పరిశీలిస్తే సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

వినతిపత్రం అందిస్తున్న కిషోర్

నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యూరు : అమ్మవారి కరుణ భక్తులందరిపై ఉండాలని, అమ్మవారిని కోరుకున్నట్లు అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు. కొయ్యూరు మండలంలోని శరభన్నపాలెంలో సోమవారం దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ మాధవి ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9 రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

విఆర్‌పురం: మండలంలోని శ్రీరామగిరి పంచాయతీ లో దేవి శరన్నవరాత్రులు సందర్భంగా శ్రీరామగిరిలో రెండో భద్రాద్రి క్షేత్రంలో కళ్యాణ మండపం దగ్గర అమ్మవారి విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. రేపటి నుండి అక్టోబర్ 2వరకు పూజలు కొనసాగుతాయని ఒక్కోరోజు ఒక్కో అలంకారంలో అమ్మవారు దర్శనమి స్తారని వారు తెలిపారు. ఉత్సవాల్లో శ్రీచక్రనవార్నవ అర్చన విశేష పూజలను నిర్వహిస్తారు. విగ్రహదాత పెందుర్తి సుదర్శన్ ఆత్మకూరు కాంతారావు (భవాని) గుండుపూడి లక్ష్మణ్ ఎన్.సత్యనారాయణ కమ్మ చిచ్చుసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రేడింగ్ పరీక్షకు ఎంపికైన విద్యార్థులు

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జ్ఞానాపురంలో జూబ్లీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సన్ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గణేష్ మహారాణా, పిల్ల హేమంత్‌కుమార్ పర్యవేక్షణలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. జూబ్లీ స్కూలు, వివేకానంద విద్యా నిలయం, అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్, సిపి బ్రౌన్ హైస్కూల్, న్యూటన్ హైస్కూల్ ఇతర కరాటే విద్యార్థులు కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో విశాఖ కరాటే పితామహులు మల్ల సూర్యారావు తనయుడు మల్ల సుధాకర్ గ్రాండ్ మాస్టర్‌గా ఈ గ్రేడింగ్ నిర్వహించారు. ఈ గ్రేడింగ్‌లో మొత్తం 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కంచరపాలేనికి చెందిన వివేకానంద విద్యాలయం విద్యార్థి నిత్యతేజకు బ్లాక్‌బెల్ట్ ప్రదానం చేశారు. అదే స్కూలుకు చెందిన విజయకుమార్‌కు, నైతికకు బ్రౌన్ ఫోర్, కంచరపాలెం జివిఎంసి హైస్కూల్‌కు చెందిన అభిషేక్‌కు బ్రౌన్‌వన్ ప్రదానం చేశారు.

30న సత్యశోధక్ మహాసభ, ర్యాలీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: మహాత్మా జ్యోతిరావుపూలే సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి 152 ఏళ్లయిన సందర్భంగా దళితవిముక్తి ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన సత్యశోధక్ మహాసభను నిర్వహిస్తున్నామని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ముందుగా కార్యక్రమానికి సంబంధించి పోస్టర్, ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న విజయనగరం జిల్లా కొత్తవలస మండల కేంద్రంలోని రామాకల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు మహాసభ జరుగుతుందని తెలిపారు. సభకు ముందు కొత్తవలస జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం నుండి సభాప్రాంగణం వరకూ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నవయాన బహుజన సంక్షేమ సంఘం కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

ఎజిఐఎఫ్ -2025 రోడ్ షో

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : అమెజాన్ ఇండియా గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ (ఎజిఐఎఫ్) మంగళవారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమెజాన్ సంస్థ ప్రతినిధి శ్రీవీర్ మాట్లాడుతూ, ఎజిఐఎఫ్ -2025లో భాగంగా ప్రముఖ బ్రాండ్లు శామ్‌సంగ్, ఆపిల్, వన్ ప్లస్, ఐక్యూ వివో, షోవోమీ, రియల్‌మీ, లావా, ఇంకా ఎన్నో అగ్ర బ్రాండ్స్ స్మార్ట్ ఫోన్లు, యాక్ససరీస్‌పై అతి తక్కువ ధరలకు అందిస్తున్నట్లు తెలిపారు. సేల్ ప్రైమ్ సభ్యుల కోసం 24 గంటలు ముందస్తుగా ఇది ప్రారంభమైందన్నారు. వైర్ లెస్ ఇయర్ బడ్స్, ఛార్జింగ్ సొల్యూషన్స్, ప్రొటక్టివ్ కేసులు ఎంచుకోవచ్చని తెలిపారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు

సహకార బ్యాంకులపై అవగాహన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే కార్యక్రమాలను పురస్కరించుకుని ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు, జిల్లా సహకార శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాంనగర్‌లోని పైడా డిగ్రీ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ బ్యాంకులో పొదుపు ఖాతాలు, వాటి నిర్వహణ, విద్యా రుణాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ప్రత్యేక రుణసదుపాయాన్ని తమ బ్యాంకు కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పైడావిద్యాసంస్థల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, సహకారశాఖ జిల్లా అధికారి సత్యశ్రీ, ప్రిన్సిపల్ డాక్టర్ సరోజిని, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్యామ్ కిషోర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ లంగ్స్ కాదు.. ఆపరేషన్ స్టమక్ '

పేదల దుకాణాల తొలగింపుపై వాసుపల్లి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో చిరు వ్యాపారుల కడుపు కొడుతూ జివిఎంసి చేపట్టిన తోపుడు బండ్లు, బడ్డీల తొలగింపుపై వైసిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కెజిహెచ్‌ను ఆనుకుని ఉన్న దుకాణాలు తొలగిస్తారని తెలిసి దక్షిణ వైసిపి శ్రేణులతో కలిసి సోమవారం ఆపరేషన్ స్టమక్ పేరుతో కెజిహెచ్ ఒపి ఎదుట రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నగరంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న కారణంగా, దుకాణాల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారానికి జివిఎంసి అధికారులు వాయిదా వేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ జివిఎంసి అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం దుర్మార్గమన్నారు. దుకాణాల తొలగింపులు ఆపకపోతే వారికి అండగా వైసిపి పోరాటం చేయడానికి సిద్ధమని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బొల్లవరపు జాన్ వెస్లీ, కొండా రాజీవ్ గాంధీ, దొడ్డి రామానంద్, జిల్లా కార్యదర్శి పద్మనాభ అమ్మాజీ, అభిరెడ్డి, అడివిషరెడ్డి దశమంతుల చిన్న పాల్గొన్నారు.

పండుగ ఆఫర్లు ప్రకటించిన ఎస్‌బిఐ కార్డ్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఎస్‌బిఐ క్రెడిట్ కార్డ్ 'ఖుషియా అన్‌లిమిటెడ్' ప్రచారంతో దేశవ్యాప్తంగా విస్తృతమైన ఆఫర్లను అందిస్తోందని ఎస్‌బిఐ కార్డు అధికారి సలీల తెలిపారు. సిరిపురంలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సలీల మాట్లాడుతూ, వినియోగదారులు టైర్ 2, టైర్ 3 నగరాలతో సహా 2,900 కి పైగా నగరాలలో ఆన్లైన్, ఆఫ్‌లైన్ ప్లాట్‌ఫామ్‌పై 1250కి పైగా వ్యాపారులచే ఆఫర్లు, క్యాష్‌బ్యాక్ ,తక్షణ డిస్కౌంట్ ఆఫర్ల నుండి ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. ఈ పండుగ ఆఫర్లు అన్ని కీలక విభాగాలపై వర్తిస్తాయని తెలిపారు. ఎస్‌బిఐ కార్డ్, అమెజాన్, రిలయెన్స్ రీటెయిల్ గ్రూప్, మ్యాక్స్, రేమండ్స్, మాంటె కార్లో వంటి ప్రముఖ భాగస్వామ్య బ్రాండ్స్‌లో కొనుగోళ్లపై డిస్కౌంట్లను అందిస్తోందని వివరించారు.

దుకాణాల బాధితులకు ప్రత్యామ్నాయం చూపాలి

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : ఆపరేషన్‌లంగ్స్ పేరుతో చిరు వ్యాపారస్తులపై కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా దుకాణాలు తొలగించడం సరికాదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకటవర్మరాజు అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ భవానిశంకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, జివిఎంసి అధికారుల చర్యల వలన మధ్యతరగతి, చిన్న కుటుంబాలు రోడ్డు పాలయ్యాయన్నారు. తక్షణమే ప్రభుత్వం వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్కరాజు రామారావు, శివకుమార్, పినమలా, కమలాకర్, మహేష్, జగన్, త్రినాథ్, ఆనంద్ పాల్గొన్నారు.